# ఉ. కా. గారి జడ్జిమెంటు !

ఘనమైన అయ్యా,

నేనున్నూ, నాతోటి మరి ముగ్గురు యు. డి. సి. లున్నూ మన కార్యాలయపు మహాభవనంలో నా మూలగల గుహాలో సుఖంగా కాలక్షేపం చేస్తూ ఉంటిమి.

ఇలా మా కాలం మూడు జోకులూ, ముఫ్ఫై నవ్వులూ, ఎనభై ఫైళ్లూగా గడచిపోతూ ఉండగా ఓ సుదినాన తామూ గుహాను దర్శించి “ఇదేమి! ఆఫీసు రూమా! పందుల దొడ్డియా! ఏమి కంపు! ఏమి చెత్త; ఏమి చెమ్మ.” అని సెలవిచ్చుచూ, ప్రశ్నించుచూ హఠాత్తుగా తుమ్మగా ఓ ఘనమైన అయ్యా, తత్‌క్షణంలో తమ అమూల్యమగు ఫారిన్ ఇంపోర్టెడ్ కళ్ళజోడు ఎగిరి క్రిందపడి ముక్కలు, ముక్కలగుట తమకు జ్ఞాపకముండియే యుండును.

కార్యదర్శి మహాశయా, తమకా ఘట్టం బాగా గుర్తుండియే యుండును. తామా క్షణమున మాపట్ల అత్యంతాభిమానముగలవారై మా గుహాను తత్క్షణం గదిగా మార్చవలసినదిగా పగిలిపోయినట్టి తమ కండ్లజోడు తాలూకు

అవశేషములను భక్తి ప్రపత్తులతో ఏరనుంకించుచున్న ఉప సహాయ కార్యదర్శులనూ, సూపరింటెండెంట్లనూ ఆగ్రహావ మానముల నణచుకొనుచూ గద్దించి, గర్జించియుండిరి.

మరునటిదినం వారున్నూ ప్యాసైన ఆర్డర్లను చంక నిడుకొని అమృతం పంచబోవు మోహినీ భంగిమలతో మా ముందు ప్రత్యక్షమై "పాపులారా, మీ అదృష్టము పుచ్చి యుండెను. మీకీ గుహావాసమునుండి విముక్తి లభింప నుండెను. రేపు ఆదివారం మీ గుహ శుభ్రపరుపబడి సోమ వారమునకు శోభనం గదిలా మార్చబడును. కాన, తాము ఆ రోజు కొంపలకు పోవుముందు, మూటా, ముల్లె జాగ్రత్తగా బీరువాలలో సర్ది మరీ పొండు." అని సెలవిచ్చియుండిరి.

మహాశయా, తామిక్కడ ఒక సంగతి గమనించవల యును.

వారు మమ్ములను సామాన్లు బీరువాలలో సర్దమని మాత్రమే వాక్రుచ్చియుండిరి. కాని, మేము నలుగురం చందాలు వేసుకుని ఓ తాళం కూడా కొని సదరు బీరువాకు వేసి, దానిపై మాలో ఒకరగు పుల్లయ్యగారి సంతకంగల సీలుకూడా వేసి మాకు గల జాగ్రత్తను, ప్రభు భక్తిని వలిన వారి సొత్తుపట్ల గల ఆప్యాయతను ప్రదర్శించియుంటిమి.

మరునటి ఆదివారం తమ ఆజ్ఞలు తు.చ. తప్పక నిర్వ ర్తింపబడి యుండనోపు. (నోపకుండుట కెన్ని గుండెలుండ వలె.) సోమవారం ఉదయం యదావిధిని మేము మా గుహలో ప్రవేశింపబోగా...ఆ...హా...! తమనేమని కీర్తింపగలము.

మేము కీర్తింపగలుగుటేమి ఖర్మ. సదా తమకే జైరుకొట్టుచూ కాలక్షేపము చేయుచుండు మన గుంటనక్క సూపరింటెం డెంటయినా వర్ణింపగలడా!...

సంగతేమనగా మాసుప్రసిద్ధమగు గుహ గదిగా మారి యుండె. కాని, ఓ ఘనమైన అయ్యా, మా బీరువా నలంక రించియుండిన తాళంపైని సదరు పుల్లయ్యగారి సీలు మాయ మయ్యె. తాళం ఊడబీకబడి యుండె. బీరువాలోని సదరు పుల్లయ్యగారికి చెందిన ఆఫీసు సామగ్రి సుమారు నూరు రూపాయల విలువగలవి రెక్కలు కట్టుకొనో లేక మొలుచుకు వచ్చో గాని బహు విచిత్రముగా ఎగిరిపోయె.

అయ్యా, ఇది ఎంతయు శోచనీయమగు విషయమనుట నిస్సందియముగదా! కాన, తామా సామగ్రికి రెక్కలు మొలుచుటకు హేతువెద్దియో విచారించి తగు చర్యలు తీసు కొనగలరని ఆశించుచున్నాడను.

పోయిన వస్తువుల వివరమున్నూ అయిటములవారీగా వాటి సుమారు ఖరీదుగల జాబితాయున్నూ, మరియు నేనా అపూర్వ దృశ్యమునుగాంచి నిశ్చేష్టుడనైయున్న సమయాన నన్ను గిల్లి కదలించి స్పృహలోనికి తెచ్చిన నాతోటి మరి ద్దరు యు. డి. సి. ల సంతకములున్నూ సాక్ష్యముగా ఇందుతో జతపరుపబడియున్నవి.

—ఫలానా యు. డి. సి. వ్రాలు.

18-9-1960

6)

## 2

ఫలానా సెక్షన్ యు. డి. సి. పుల్లయ్య సమర్పించిన రిపోర్టు ఇది. తన సెక్షన్ రూంలో చోరీ జరిగినట్లుగా సదరు పుల్లయ్య బల్లగుద్ది మరీ చెబుతూ వున్నాడు. మన కార్యాలయంలో ఇలాంటి తప్పుడు పనులు జరగటం అసాధారణం, అవమానకరం. కనుక, కార్యదర్శిగారు చదివేలోగా ఈ చోరీ రిపోర్టును సహాయ కార్యదర్శిగారు చూచుట అవుసరమని నా అనుమానము.

కాన, స. కా. గారికి ఫైలును ప్రవేశించటమైనది.

—సూపరింటెండెంటు వ్రాలు.

18_3_1961

## 3

ఈ రిపోర్టును చదివించుకుని వినడమైనది. చోరీ అనేదే దారుణమ్పని! అది మన ఆఫీసులోనే జరగటం మరీ ఘోరం! తత్క్షణం అరికట్టవలసినట్టిది. సరే! జరిగిందేదో జరిగింది. ఏం చేస్తాం? ఖర్మ.

కాని. ఇటువంటి సందర్భములలో ఎవరి వస్తువు లయినచో పోయినవో వారే స్వయంగా రిపోర్టు ఇచ్చుట ఆచారము గదా! కాని ఈ పుల్లయ్యగారి లేఖలో మరి రెండు సంతకము లున్నవి. ఇట్లు జాయింట్ స్టేట్‌మెంట్ ఇచ్చుట సాంప్రదాయ విరుద్ధము గాదా! ఇట్లు మరో ఇరువురు వ్యక్తుల నీ వ్యవహారములలో దింపుటకు రూల్సు ఒప్పుకొనునా?

ఈ రూల్సు విషయంలో ఉద్దండ పండితులైన ద్వితీయ సహాయ కార్యదర్శిగారి ఉవాచ ఏమో తెలుసుకోగోరు చున్నాను.

ఈ ఫైలు ద్వి. స. కార్యదర్శిగారికి పంపడమైనది.

—సహాయకార్యదర్శి వ్రాలు.

18_9_1931

# 4

స. కా. గారి అనుమానం దివ్యమైనట్టిది. వారు ఏ ఫైలునూ ప్రత్యక్షర పరీక్ష చేయకుండా సంతకము లిడుట లేదనుట కియ్యది మరియొక ప్రత్యక్ష సాక్ష్యము.

కాని, ఇందేమి గలదు? బీరకాయ పీచేగదా! వడ్ల గింజయందుండునది బియ్యపుగింజయేనని ఏనాడో రుజువాయి ఉండెనుగదా!

కాన, స. కా. గారి సందేహమునకు హేతువైన ఫలానా పుల్లయ్య రిపోర్టు విషయంలో దానిని జాయింట్ రిప్రజంటేషన్‌గా గాని, కంప్లయింట్‌గా గాని మనం పరిగణించ నవసరంలేదు.

దీనిని మనం సదరు పుల్లయ్య తానుండే గదిలో జరిగినట్టి చోరీని ఘనత వహించిన పై అధికారుల దృష్టిలోకి తేవటానికి పడిన తిప్పలుగానే గుర్తించవలెను. మిగిలినవారి సంతకాలను గురించి మనం మాకియల్లీ పార్లమెంటరీ కోడ్

గాని, మనుధర్మ శాస్త్రంగాని తిరగవేయ నవుసరం లేదని నా దృఢాభిప్రాయము.

అంతగా మెమోలు ఇవ్వదగిన పాయింట్లేమన్నా కావాలంటే నాదొకటి. అందరితో పాటు ఆ గదిలో వుంటున్న నాలుగో యు. డి. సి ఈ రిపోర్టుపై ఎందుకు సంతకం చేయలేదు? అనునదాలోచింపదగును.

—ద్వి. స. కార్యదర్శి వ్రాలు.
18_3_1962

# 5

అవును. నిజమే. నాలుగోవాడు ఎందుకు సంతకం చేయలేదు? అయినచో ఈ సందర్భములో మనము చేయ వలసినది ఏమి? ఉప కార్యదర్శిగారు తమ అమూల్యమగు తీర్పు చెప్పెదరుగాక.

ఫైలు ఉ. కా. గారికి పంపడమైనది.

స. కా. వ్రాలు.
18_9_62

# 6

ఏమో! నాకేం తెలుస్తుంది? నేనా రోజు టూర్‌లో ఉన్నట్లు జ్ఞాపకం. మళ్ళీ ఈ రాత్రి టూర్‌కు బయలుదేరాలి. వెధవ టూర్లు! క్షణం తీరికలేదుగదా. కాన, కార్యదర్శిగారే తీర్పు చెప్పవలెను. అంతగా అయితే ఆ నాలుగోవాడికి ఓ

మెమో ఇచ్చి సెంతకం ఎందుకు చేయలేదో సంజాయిషీ అడగదగును.

ఫైలు కా. గారి దివ్యసమ్ముఖానకు పంపడమైనది.

ఉ. కా. వ్రాలు
18-3-1963.

## 7

ఇన్నాళ్ళకు ఇప్పుడా నాకీ ఫైలు పంపేది. ఇంత చిన్న విషయానికి ఇందరి టైం తగలెట్టటమా! ఇన్ని బుర్రలు ఖరాబు చేసుకోవడమా! ఎవడో ఒకణ్ణి పట్టుకుని వాడి నెత్తిన పెద్ది పీట వేయడమా!

సరే. వారం గడువివ్వటమయినది. ఉ. కా. గారు ఈ చోరీ బాధ్యత ఎవడి నెత్తిన రుద్దాలనేది తక్షణం తేలుస్తారు గాక. ఫైలు ఉ. కా. కు పంపడమైనది.

—కార్యదర్శిగారు వ్రాలు.
19-9-1963.

## 8

స. కా. మహాశయా! కా. గారి శ్రీముఖం చిత్తగించవలసింది. అందులో రెండవ పేరాలోని విషయాలు ప్రత్యేకించి గమనించవలసింది.

ఎంక్వైరీ జరిపి రెండు రోజుల్లో నాకు రిపోర్టు పంపవలసింది.

ఫైలు స. కా. కు పంపడమైనది.

ఉ. కా. వ్రాలు.
18_9_1964

# 9

ఈ ఫైలు తాలూకు ఎనిమిదవ అయిటం గమనించండి. సూపరింటెండెంట్ మహాశయా! తక్షణం ఎంక్వైరీ జరిపి సాయంత్రానికల్లా ఎవడి పీక నులమాలో తేల్చవలసింది. అవసరమనుకుంటే మన గుంటకల్లు సూపరింటెండెంటు సహాయంకూడా తీసుకోవలసింది.

—స. కార్యదర్శి వ్రాలు.
18_9_1964.

# 10

చిత్తగించితిని. మహాశయా! ఈ ఫైలు తాలూకు మొదటి అయిటం పరిశీలించండి. సదరు పుల్లయ్య సుమారు నూరు రూపాయల విలువగల వస్తువులు ఎగిరిపోయెనని మొత్తుకొనియున్నాడు. అదే అయిటంలో ఒక లిస్టు జతపరచి యున్నాడు. అందులో పరారీ అయిన వస్తువుల పేర్లున్నూ విడి విడిగా వాటి సుమారు ధరలున్నూ వ్రాసియున్నాడు. నేను జాగ్రత్తగా అవన్నీ కూడగా పోయిన వస్తువుల మొత్తం విలువ అక్షరాల నూట రెండు రూపాయలని తేలియున్నది. మరి సుమారు నూరురూపాయలే పోయినవని ఎన్ని గుండెలతో

వా(కుచ్చియున్నాడుకి ఇది నా మొదటి పరిశోధనా ఫలితము. ఈ విషయంలో మనమూ పుల్లయ్యకు ఒక మెమో యివ్వ దగును.

ఇహ ఆ ఆదివారంనాడు నా అజమాయిషీ క్రిందనే పదిమంది పుల్లయ్యన్లు ఆ గుహను శుభ్రపరచియుండిరి. నేను వేయి కండ్లతోనూ, మన గుంటనక్క సూపరింటెండెంటు రెండువేల కండ్లతోనూ కనిపెట్టియుంటిమి. కాన, ఆదివారం నాడే చోరీ జరిగినదనుట మమ్ములను, ప్రత్యేకించి నన్ను అవమానించుట, అనుమానించుట తప్ప వేరుగాదు. ఈ విష యంలో నేను సదరు పుల్లయ్యను హెచ్చరించవలసి యుండును. మెమోకూడా ఇవ్వదగును.

కాగా, ఆదివారంనాడు పనిజేసినట్టి పదిమందిని పిలిచి పేరుపేరునా "ఆ చోరీ చేసినది నీవేనా నాయనా ? మరేం భయపడకు. చెప్పు. ఇంక్రిమెంటిప్పిస్తాగా." అని బుజ్జగించి తిట్టి. నిర్మొహమాటముగా ప్రశ్నించియుంటిని. కాని, వారందరూ తలా పది గుంజీలు తీసి తా మేపాపమూ ఎరుగ మని భోరున ఏడ్చియుండిరి.

మన గుంటనక్క సూపరింటెండెంట్ మరొక సంగతి సెలవిచ్చియుండెను. "చోరీకి గురైన సదరు బీరువా గదిలో ఒక మూలగా యుండెనుగదా ! మూలల్లో బూజు జాస్తీగా పట్టియుండునుగదా! మన పనివాళ్ళ శ్రద్ధాసక్తులు మనకు తెలియనివా ! వాండ్లసలా మూలకే పోయి యుండరు. ఇది

తథ్యము. గాన, వారి ననుమానించుట వ్యర్థము!" అని సెలవిచ్చెను. ఇయ్యదియు సత్యమే.

మనలో మాట. ఆ పుల్లయ్యగాడు కాస్త పొగరు బోతనీ, రోజూ లంచ్ టైములో మిరపకాయ బజ్జీలు తెగ నములుతుంటాడనీ అంటారు. ఆ పైన తమ చిత్తం.

ఫైలు స. కా. గారికి పంపడమైనది.

సూపరింటెండెంటు వ్రాలు.
18_3_1965

# 11

పదవ అయిటం చిత్తగించండి. రెండవ పేరాలో సూపరింటెండెంటుగారు మన పనివాళ్ళందరూ బుద్ధిమంతులని సర్టిఫికేట్లిచ్చియున్నారు. ఇహ, సూపరింటెండెంటుగారి విష యంలో ఆయనను అనుమానించటమే పాపం. లోగడ ఒక సారి నా కోటు వెనక ఓ పూచికపుల్ల అంటుకొని యుండగా చూసి నా అనుమతి పొందిన తరువాతనే దానిని తీసి చెత్త బుట్టలో భద్రంగా వేసియుండెను. పైగా ఆయనకు జాగ్రత్త ఎక్కువ. వెనక మా మూడోవాడి బారసాల జరిగినప్పుడు ఈయనే స్వయంగా దగ్గరుండి అన్ని ఏర్పాట్లూ చేసి ఏ లోపమూ జరగకుండా వేయికండ్లతో కనిపెట్టి అతిథులను మెప్పించియుండెను.

కాన, మనం అట్టి వ్యక్తి నిజాయితీని, కార్యదక్షతను, జాగ్రతను శంకించుట పాపకార్య మవగలదు.

ఇహా పదవ అయిటంలోని ఆఖరి పే

ప్రత్యేకించి పరిశీలింపదగును. సదరు పుల్లయ్య తమరున్నూ లోగడ నాతో వ్యక్తిగతంగా స. కా. యున్నారు. క్లర్కుగా పనిచేస్తూ ఖరీదైన బెర్లిన్లు రినిన్నీ ఖరీదైన సిగరెట్లు త్రాగుతూ, ఖరీదైన హోటళ్ళలో మనకు తరచు ఎదురవుతూండేవాడు. ఎల్లప్పుడూ అనుమానించ దగినవాడే అయి ఉండునుగదా!

ఫైలు ఉ. కా. గారి అంతిమ నిర్ణయమునకై పంపట మైనది.

—స. కార్యదర్శి వ్రాలు.
18_9_65

# 12

ఉప కార్యదర్శినైన నేను ఈ ఫైలు నంతటినీ క్షుణ్ణం గానూ, ప్రత్యక్షరమున్నూ పరిశీలించి, పరిశోధించి చివరకు వచ్చిన నిర్ణయం ఏమనగా:

అయిటం నెంబరు ఒకటి పేగా ఎనిమిదిలో సదరు పుల్లయ్య సుమారు నూరు రూపాయల సామగ్రి ఎగిరిపోయె నని చెప్పుకొనియున్నాడు. కాని అదే అయిటం ఆఖరి పేరాలో సుమారు నూట రెండు రూపాయల విలువగల వస్తువులు పోయినట్లు పేర్కొనబడినది. ఈ తికమక ఏల సంభ వించెను? ఆలోచించవగినదిగాదా.

తథ్యము.

సెలవిచ్చెను



మ

బొత్తస్సీ, రియు,

నముల అద్దె అయిటం పేరా ఆరులో సదరు పుల్లయ్యాదులు చందాలు వేసుకుని తాళం కొనుక్కొని అది ఉపయోగిస్తున్నట్లు పేర్కొనబడినది. ఎవడబ్బగాడి పర్మిషన్‌తో వీళ్ళలా చేసినట్లు? ఇది మన డిపార్టుమెంటుకే ఇన్సల్టుగాదా? ఆలోచించవలెను.

మరియు,

ఆ గదిలో ఉంటున్న నాలుగో వాడి సంతకం చోరీ రిపోర్టులో ఎందుకు లేదు? వాడికేం కళ్ళు నెత్తికొచ్చాయా? లేక కొమ్ములు మొలుచుకొచ్చాయా? అనేది పరిశీలించి, పరిశోధించ నగత్యము కలదా? ఆలోచింపదగును!

మరియు,

అయిటం నెంబరు పది, పేరా రెండులో సూపరింటెండెంటు ఆనాడా గదిలో పనిచేసిన ప్యూన్లందరూ బుద్ధిమంతులని సర్టిఫికేట్లిచ్చియున్నారు. కాన మనం వారి ననుమానించుట ఆఫీసులో అనారోగ్యకర వాతావరణమును సృష్టించగలదు. పైగా సూపరింటెండెంటు సర్టిఫికెట్లవిలువను కించపరచుటయు కాగలదు. కాన వారి సంగతి వదలివేయవలెను.

మరియు,

మన సూపరింటెండెంటున్నూ, గుంటనక్క సూపరింటెండెంటున్నూ ఏమన్నా చేయివాటం చేసిఉంటారా? అని ఆలోచించటం మన డిపార్టుమెంటుకీ, మన హోదాలకీ అవమాన

కరము. పైగా అయిటం పదకొండు, పేరా ఒకటిలో స. కా. గారు వీరికి సర్టిఫికేట్లుకూడా ఇచ్చియున్నారు. కాన, వీరినిన్నీ మినహాయించ వలెను.

మరియు,

అయిటం ఒకటి, అగ్రిపేరాలో సాక్షి సంతకములు చేసినవారిని నేను విచారించగా వారు తామేపాపమూ ఎరుగ మని గుంజీలు తీయబోగా నేనే వారించియుంటిని. పైగా ఆ పోయిన వస్తువుల సైజు, బరువు, రంగు వగైరా వివరాలను గూర్చి ప్రశ్నించగా వారిముఖములు తెల్లబడియుండెను. కాన, వారినిన్నీ వదలివేయు వలెను.

కాగా,

ఇంకెవరు కలరు? ఈ పుల్లయ్య అనబడే యు. డి. సి. ఎట్టివాడు? వాడు నిర్లక్ష్యత కలమనిషి యనునది డిపార్టు మెంటెరిగిన సత్యమనుమాట వాస్తవమేనా?

ఒకసారి నేనా గుహాకు పోయిన సమయమునకు వాడు దర్జాగా కుర్చీలో కాళ్లుపెట్టుకుని సిగరెట్దమ్ము కొట్టు చుండెను.

మరియు,

గతనెలలో నేను కుటుంబ సమేతముగా సెకండ్షో సినిమాకుపోయి, ఇంటర్వల్లో చూద్దునుగదా! మా పెద్దమ్మాయి ప్రక్క సీటులో దర్జాగా కాళ్ళు బార్ల జాపుకుని ప్రక్కన అందమైన ఆఫీసరు కూతురున్నదనే జ్ఞానమున్నా

లేకుండా పైకప్పు కేసి చూస్తూ కూర్చున్న ఆ బద్మాషు గాడెవడు? వీడే! ఈ పుల్లయ్యగాడే గదా!

మరియు,

మొన్నామధ్య ఈ పుల్లయ్యనే నేను ఆఫీసు టైములో బార్‌లో చూసి యున్నాను. నేను నా స్నేహితులతో కలసి బీరు త్రాగుతూండగా అదే సమయంలో దూరాన కూర్చుని ఎవడితోనో కలసి విస్కీ త్రాగుతూన్న వీడే, ఈ పుల్లయ్యగాడే నన్ను చూసి దాక్కోకపోగా ఇకిలిస్తూ పలక రించియుండెను.

మరియు,

మొన్న మన ఆఫీసుతరఫున ఏర్పాటయిన ఫంక్షన్‌లో వీడు డ్యూటి మీద ఉండికూడా ఏర్పాట్లు చూడటానికి బదులు ఫలానా మినిస్టర్‌గారి భామ్మరిదితో కబుర్లాడుతూ, ఇకిలిస్తూ వరండాల్లో తిరుగుతూ ఉండెను. నన్నా భామ్మరిదికి పరిచయం చేయకపోగా కనీసం నాకో నమస్కారమన్నా పెట్టి యుండలేదు.

సవాలక్షలో ఇవికొన్ని! ఇవన్నియు ఏమి గుజాను ఘరచు చున్నవి? ఇవన్నీ సదరు పుల్లయ్య నిర్లక్ష్యానికి, బాధ్యతా రాహిత్య ప్రవర్తనకు తార్కాణములు కావా?

కాన,

ఈ చోరీకి పూర్తి బాధ్యత సదరు పుల్లయ్యదే ననియూ, అతనా వస్తువులను ఏమరుపాటున ఇంటికి తీసుకు

పోయి, ఎక్కడో పెట్టి మరచిపోయి ఇలా అవకాశం చూసు కుని రిపోర్టు చేశాడనియూ నేను దృఢంగా నమ్ముతూ యున్నాను.

కనుక,

పోయిన వస్తువుల విలువను సదరు పుల్లయ్య జీతం నుండి కత్తిరించుట గురించికూడా కార్యదర్శిగారు ఆలోచింప దగును.

మరియు,

స. కా. గారు ఈ ఫైలులోని విషయములను వాడి. పర్సనల్ ఫైలులో ఎర్రసిరాతో అందంగా వ్రాయించే విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకో వలెను.

కాగా,

అంతిమ నిర్ణయానికై ఫైలును కా. గారికి పంపడ మైనది.

— ఉ. కా. వ్రాలు.

18_3_66

## 13

అవును. ఉ. కా. గారి జడ్జిమెంటు అమోఘముగా నున్నది. మున్ముందు ఇటువంటి సందర్భములు తటస్థించి నపుడుకూడా పరిష్కారమునకై ఈ పద్ధతియే అవలంబింప దగును.

కాగా, అయిటం నెంబరు పన్నెండులోని ఉ. కా. గారి సూచన ఆమోదించటమయినది. పోయిన వస్తువుల విలువ సదరు పుల్లయ్యనుండి రాబట్టుటకు తగు చర్యలు వెంటనే తీసుకోవలసింది.

—కార్యదర్శిగారు వ్రాలు.
18_9_1966

# 14

సూపరింటెండెంటు మహాశయా! తక్షణం ఆ పుల్లయ్యగాడి జీతంనుంచి ఆ పోయిన వస్తువుల విలువ రాబట్టే ఏర్పాటు చేయవలసింది. ఈ లోగా వాడికో మెమో ఇచ్చి ఎవరన్నా ఫొటోగ్రాఫర్ చేత ఆ సమయంలో వాడి మొహం ఎలా ఉన్నదలా ఫొటో తీయించి నాకు సబ్‌మిట్ చేయవలసింది.

—ఉ. కా. వ్రాలు.
18_3_1967

# 15

ప్రభో! క్షమించాలి. పిల్లలుగలవాణ్ణి. గతవారంలో సదరు పుల్లయ్యగారు తృతీయ స. కార్యదర్శిగా ప్రమోటయిన సంగతి తెలీక ఈ రోజు మెమో పుచ్చుకు వెళ్ళినాను. ఆయన అది చదివి, ఇకిలించి, మూడోకన్ను ఉండి, అది తెరవబోతున్న వాడిలా చూసి, చొక్కా చేతులు మడుస్తూ లేచి, మెమో చించి చెత్తబుట్టలో వేసి, "పుణ్యా

పురుషా, నిన్నూ, నీ ఉ. కా. నూ మన్ను తినిపించమనెదవా? లేక మన్యమునకు ట్రాన్స్‌ఫర్ చేయించమందువా ?" అని ప్రశ్నించెను.

"మనలో మాట ప్రభో! ఆతగాడు ఫలానా ఎమ్మెల్యే బావమరిది అనీ, ఫలానా మంత్రిగారి బావమరిదికి కాబోతున్న అల్లుడనీ ఆఫీసులో పుకారుగా ఉంది. ఆ పైన తమ చిత్తం. ప్రస్తుతానికి ఫైలు పొయ్యిలో వెయ్యటం ఉత్తమం.

చిత్తగించవలెను.

ఫైలు సీలు చేసి ఉ. కా. గారికి పంపివేయుటమైనది.

సూపరింటెండెంటు వ్రాలు.

18 9 1967